క్లుప్తంగా

సీపీఎం మహా సభలను జయప్రదం చేయాలి



దుర్గానగర్ గ్రౌండ్‌లో కవాతు చేస్తున్న రెడ్ షర్ట్ వలంటీర్స్

సింథియా: పెందుర్తి దరి సుజాతనగర్‌లో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్ గ్రౌండ్‌లో రెడ్ షర్ట్ వలంటీర్స్ కవాతు నిర్వహించారు. డీవైఎఫ్ఐ మల్కాపురం జోన్ కార్యదర్శి వాసు కవాతును ప్రారంభించి మహాసభలకు సంబంధించిన పలు అంశాలను తెలియజేశారు. పేద ప్రజలకు అండగా ఉండే పార్టీ సీపీఎం అని, ప్రజలకు అండగా ఉంటూ ప్రభుత్వాలు అవలంబించే కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తున్నామన్నారు. జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, నరేష్, గణేష్, ఎల్.కృష్ణ, రాజు, శంకరరావు, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా విష్ణు పురాణ కథ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మౌర్యసింహా, కార్పొరేటర్ గల్లా చిన్నా

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో 5 రోజుల పాటు జరిగే శ్రీ విష్ణు పురాణ ర్యాలీని బుధవారం ఘనంగా ప్రారంభించారు. ర్యాలీలో ఎమ్మెల్యే గణబాబు కుమారుడు మౌర్యసింహ, వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా పాల్గొని ఊరేగింపుగా వెళ్లారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నరీన్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు ..



కుటుంబ సభ్యులకు అప్పగించిన నిర్వాహకులు

విశాఖ విద్య: జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించిన వ్యక్తిని బుధవారం కుటుంబం చెంతకు చేర్చారు. షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత తెలిపిన వివరాల ప్రకారం.. గాజువాక పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్న వ్యక్తికి ఏడాది కిందట బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ ఆశ్రయం కల్పించారు. అంతేకాకుండా వైద్యం నిమిత్తం మెంటల్ కేర్ హాస్పటల్‌లో చికిత్స అందించారు. ఆ వ్యక్తి కోలుకున్న తర్వాత తనది కోల్‌కతా దగ్గర మిధినీపూర్ అని చెప్పడంతో షెల్టర్ మేనేజర్ మమత శ్రద్ధా ఫౌండేషన్ సహాయంతో కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. ఏడాది కిందట తప్పిపోయిన కొడుకు రావడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

కడప యువ సమ్మేళనానికి మై భారత్ వలంటీర్లు

ఏయూక్యాంపస్: అంతర జిల్లా యువ సమ్మేళనంలో పాల్గొనడానికి విశాఖ జిల్లాకు చెందిన నెహ్రూ యువ కేంద్రం(మై భారత్) వలంటీర్లు బుధవారం కడప బయలు దేరి వెళ్లారు. వైఎస్సార్ కడప జిల్లాలో ఈ నెల 26 నుంచి ఐదు రోజుల పాటు జరిగే యువ సమ్మేళనంలో వలంటీర్లు భాగమవుతారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన 25 మంది యువతీ యువకులు దీనిలో పాల్గొన్నారు. విభిన్న ప్రాంతాల ప్రజలు జీవనం, అలవాట్లు, సంస్కృతులు తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. భారత యువజన మంత్రిత్వ శాఖ, ఎన్‌వైకే సమన్వయంతో 90 యువ సమ్మేళనాలను దేశ వ్యాప్తంగానిర్వహిస్తున్నారు. విశాఖ నుంచి వెళ్తున్న ఈ బృందం ప్రయాణాన్ని ఎన్‌వైకే ఉమ్మడి విశాఖ జిల్లా యువజన అధికారి గొర్లె మహేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో మెరుపులు



శిక్షణ ఇస్తున్న తై.ప్రకాష్

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తై. ప్రకాష్ సత్తా

మార్షల్ ఆర్ట్స్ అంటే కిక్‌లు, పంచ్‌లే కాదు. కారు చక్రాల కిందట అరచేతులు పెట్టడం, పొట్టపై కార్లు ఎక్కించుకోవడం, తలపై ట్యూబ్ లైట్లు విరగొట్టడం, 10 వరసల పలకలను సునాయాసంగా విరగ్గొట్టడం వంటి యుద్ధ కళల్లో ఆరితేరారు తై .ప్రకాష్. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నాడు. తాను నేర్చుకున్న విద్యను పదిమందికి నేర్పిస్తూ కోచ్‌గా అకాడమీ ఏర్పాటు చేశారు. కరాటే, కిక్‌బాక్సింగ్, బాడీబిల్డింగ్‌లలో ఎంతో మందిని తీర్చిదిద్దుతున్నారు.

–సింథియా



అంతర్జాతీయ వేదికపై అతిథులతో ప్రకాష్

- మార్షల్ ఆర్ట్స్‌లో ప్రదర్శించిన విన్యాసాలకు మరింత గుర్తింపు
- ఫౌండేషన్ ద్వారా యువతకు శిక్షణ
- ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలు సాధించిన ప్రకాష్ శిష్యులు

ఫౌండేషన్‌తో సేవలు విస్తృతం

బోధిధర్మ సన్ లైన్స్ మార్షల్ ఆర్ట్స్ ఫౌండేషన్ ద్వారా మార్షల్ ఆర్ట్స్‌లోనే కాకుండా యోగ, పిరమిడ్ ధ్యానంలోనూ శిక్షణ ఇస్తున్నారు. 62వ వార్డు ప్రకాష్‌నగర్ ప్రాంతానికి తై.ప్రకాష్ ఏన్సియంట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నుంచి 3వ డిగ్రీ పుచ్చుకున్నారు. ఆంధ్రా సరిహద్దు ఒడిశా గ్రామం గిరిసాలలో స్థిరపడి విశేష సేవలందిస్తున్నాడు. విశాఖపట్నంలో పుట్టి పెరిగిన ఆయన వృత్తి రీత్యా ఆర్ఎంపీ డాక్టర్. వైద్యంతో పాటు మార్షల్ ఆర్ట్స్‌లో యువతను తీర్చిదిద్దుతున్నారు.

ప్రకాష్ శిష్యుడికి సినిమాల్లో అవకాశం

ప్రకాష్ వద్ద బాడీబిల్డింగ్‌లో శిక్షణ పొందిన షేక్‌శ్రీను పలు పతకాలను సాధించడంతో పాటు సినిమాల్లోనూ చోటు దక్కించుకున్నాడు. మరెందరో ఆయన దగ్గర నేర్చుకుని స్పోర్ట్స్ కోటాలో పోలీస్, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ వంటి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.



ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

బాక్సింగ్‌తో కెరీర్ ఆరంభం

1989 నుంచి బాక్సింగ్‌లో ప్రకాష్ తన కెరీర్‌ను ప్రారంభించారు. 1992లో బాక్సింగ్‌లో మొదటిసారి జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించాడు.అ ఆక్కడి నుంచి ఏ పోటీలకు వెళ్లినా పతకాలను సాధించేవాడు. 1996లో విశాఖపట్నంలో మార్షల్ ఆర్ట్స్ అకాడమీని నెలకొల్పి అందరి మన్ననలు అందుకున్నారు. 1999లో మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన కరాటే బ్లాక్‌బెల్ట్ పొందిన ప్రకాష్ బంగారు పతకం అందుకున్న ప్రకాష్ అక్కడి నుంచి కరాటేలో వరుస విజయాలతో దూసుకుపోతున్నారు.

తై.ప్రకాష్ సాధించిన విజయాలు

- 1989లో తన ప్రయాణం మొదలు పెట్టిన ప్రకాష్ కరాటే, బాక్సింగ్, కిక్ బాక్సింగ్, యోగా, పిరమిడ్ ధ్యానం వంటి వాటిలో ఎన్నో పతకాలు సాధించారు.
- 2021లో ఫస్ట్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లో 50 కేజీల విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు.
- 2022లో హైదరాబాద్‌లో జరిగిన రెండో అంతర్జాతీయ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణపతకం సాధించారు.



అంతర్జాతీయ స్థాయిలో విజేతగా..

- 2023లో 19వ వికీ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో మొదటి స్థానంలో నిలిచి స్వర్ణపతకం సాధించాడు. బోధిధర్మ సన్ లైన్స్ మార్షల్ ఆర్ట్స్ ఫౌండేషన్ ద్వారా ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ నిర్వహించి 5 రాష్ట్రాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రోత్సహించారు.

అంతర్జాతీయ యూనిఫెడ్ మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ సభ్యుడిగా ఎంపిక

తై.ప్రకాష్ కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించడంతో పాటు అంతర్జాతీయ యూనిఫెడ్ మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ సభ్యుడిగా నియమితుడై ఎం.ఎ.ఎం.ఎస్ క్లబ్‌ను స్థాపించాడు. దాని ద్వారా బాక్సింగ్, కిక్‌బాక్సింగ్, యోగా, కరాటే వంటి కళల్లో పలువురు విద్యార్థులకు శిక్షణను ఇచ్చి వారిని ఆణిముత్యాలుగా తీర్చిదిద్దారు.



సినీనటుడు సుమన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రకాష్

'మళ్ల'కు ఘన స్వాగతం



మళ్ల విజయప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్లు,నాయకులు

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ బుధవారం పారిశ్రామిక ప్రాంతంలో పర్యటించారు. అనంతరం శ్రీహరిపురంలోని పార్టీ కార్యాలయంలోని నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయనకు కార్పొరేటర్లు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. కార్పొరేటర్లు పి.వి.సురేష్,బల్లా లక్ష్మణరావు,గుండపు నాగేశ్వరరావు, నాయకులు పీలా అనంత్‌కుమార్, గులిగిందల కృష్ణ,దున్న ప్రతాప్,ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్,సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జిమ్ పరికరాలు ప్రారంభం



నూతన జిమ్‌ను ప్రారంభిస్తున్న 40వ వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో రూ.18 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలులో రూ.5 లక్షల జీవీఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలను వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వార్డులో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టామని, యువత కోసం నూతనంగా జిమ్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గంట వర్మ, వరపల మహేష్, గణేష్‌మిత్రా, గుండపు అశోక్, దేబార్కి కృష్ణ, జెర్రిపోతుల శివ, పటాన్ల వెంకటేష్, బంటు కోటేశ్వరరావు, అన్నం వాసు, గుండపు సందీప్, పప్పల శివ, శేఖర్, ప్రవీణ్, సాంబ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న రమేష్ తదితరులు

విశాఖ విద్య: దేశానికి మాజీ ప్రధాని వాజ్‌పేయి చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడి రమేష్ అన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతిని పురస్కరించుకొని బుధవారం ఎన్ఏడీలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాడి రమేష్ మాట్లాడుతూ వాజ్‌పేయి మూడు సార్లు దేశానికి ప్రధానిగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. నేటి తరం నాయకులకు ఆయన ఆదర్శప్రాయుడని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సీహెచ్ మంజుల, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు వల్లిరెడ్డి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు గొటివాడ వెంకటేశ్వరరావు, నాయకులు గొర్ల అప్పలరాజు, బి. సురేష్, సీహెచ్ చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విజయబాబు

మల్కాపురం: దివంగత ప్రధాని ఏబీ వాజ్‌పేయి చిత్రపటానికి 59వ వార్డు శాంతిగిరికాలనీలోని ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కిలిగడ్డ విజయబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ప్రజల సేవ కోసం తన ఆస్తిని దారబోసిన గొప్ప వ్యక్తి వాజ్‌పేయి అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల విజయవంతానికి ర్యాలీ

కంచరపాలెం: పెందుర్తిలో ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కంచరపాలెం, ఊర్వశి కూడలి ప్రాంతాల్లో బుధవారం ప్రచారాలు నిర్వహించారు. కంచరపాలెం బీఆర్ఆర్ భవనం వద్ద పార్టీ సీనియర్ నాయకులు పెంటకోట రాము, సీహెచ్ కమల పతాకావిష్కరణ చేశారు. కంచరపాలెం జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ, బి.పద్మ మాట్లాడుతూ విశాఖ జిల్లాలో సీపీఎం ఏర్పడి 72 సంవత్సరాలు పూర్తయిందన్నారు. అనేక పోరాటాలు త్యాగాలు చేసి, బలమైన ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ కార్మికులు, కష్టజీవుల తరఫున శ్రమిస్తోందన్నారు. 28 నుంచి జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఊర్వశికూడలిలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సానబోయిన అప్పలరాజు, సోమేశ్వరరావు, ఒమ్మి అప్పారావు, విజయ, బి.సింహాచలం, జి.అప్పలరాజు, ఎం.ఈశ్వరరావు, ఎస్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ రహదారిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పండగనాడూ పస్తులేనా...

అగనంపూడి: ఆంక్షల పేరుతో విశాఖ ఉక్కు కార్మికులకు జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో 1413వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. ఉక్కు ఉత్పత్తి గణనీయంగా పెరుగుతూ సాధారణ పరిస్థితులు నెలకొంటున్నా కార్మికులు, ఉద్యోగుల జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రంతో యాజమాన్యం కలిసి కుట్రలు పన్నుతుందని మండిపడ్డారు. ఇందులో భాగంగా కార్మికులకు జీతాలు చెల్లించకుండా స్వచ్ఛందంగా ఉద్యోగం నుంచి తప్పుకొనే పరిస్థితులు కల్పిస్తుందని ఆరోపించారు. వినాయక చవితి, దీపావళి, క్రిస్మస్ వంటి ముఖ్యమైన పండగల నాడు జీతాలు చెల్లించకుండా క్షోభపెడుతున్న యాజమాన్యం భవిష్యత్‌లో తగినమూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి కలుగజేసుకొని ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించి, కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. బీఎంఎల్‌నాయుడు, కొణతాల శ్రీను, ఎస్ఎస్‌మూర్తి, పి.అప్పారావు, సాయిరామ్, బాబూరావు, మరియాదాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



సెయింట్ సేవియర్స్ ఆర్‌సీఎం చర్చిలో బాలఏసు జననం సెట్



బుచ్చిరాజుపాలెంసెయింట్ లూథరన్ చర్చిలో ప్రార్థనలు



శాంతాక్లాజ్ వేషధారణలో

విశాఖ విద్య: క్రిస్మస్ పండగను క్రైస్తవు బుధవారం ఘనంగా నిర్వహించారు.క్రిస్మస్ మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్‌లో సేవియర్ లూథరన్ చర్చి, బుచ్చిరాజుపాలెంలోని సెయింట్ థామస్ చర్చి, ఎన్ఏడీ కొత్తరోడ్‌లోని చర్చిల్లో జరిగిన వేడుకల్లో క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్ఏడీ సెంటర్ కొత్తరోడ్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్ఫా పాల్గొన్నారు. సింథియా: జీవీఎంసీ 63వ వార్డు జైఆంధ్ర కాలనీలోని క్రీస్ట్ రివైవల్ చర్చి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా ముఖ్య అతిథిగా పాల్గొని బైబిల్ గ్రంథంలోని వాక్యాలను వినిపించారు. కార్యక్రమంలో పాస్టర్ మహేష్, నాయకులు గూడెల కృష్ణ, నరీన్, క్రీస్ట్ రివైవల్ చర్చి సభ్యులు పాల్గొన్నారు.

సెయింట్ సేవియర్స్ ఆర్‌సీఎం చర్చిలో..

మురళీనగర్: మురళీనగర్–మాధవధార 48ఏ బస్సు రూటులోని ప్రధాన చర్చి సెయింట్ సేవియర్స్ ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిలో ఏర్పాటు చేసిన బాల యేసు జనన వృత్తాంతం విశేషంగా ఆకట్టుకుంది. లోక రక్షకుడు యేసు ఆశీస్సులు ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని క్రైస్తవులు ప్రార్థనలు చేశారు.

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని చర్చిల్లో బుధవారం దైవప్రార్థనలు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రార్థనలు చేస్తూ క్రీస్తును స్మరించారు. నూతన వస్త్రాలను దరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు.సంఘ కాపరులు, పాస్టర్లు క్రీస్తు జనన వృత్తాంతాన్ని వివరించారు.

సేవియర్ లూథరన్ చర్చిలో..

విశాఖ విద్య: స్థానిక లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ సేవియర్ లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ లంకపల్లి జాకబ్ రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రారథనలు నిర్వహించారు. ప్రభువును స్మరించుకొని కొవ్వొత్తులు వెలిగించారు. రెవరెండ్ కప్పల డానియల్ గాంధీ క్రిస్మస్ సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో ట్రెజరర్ నేతల శేఖర్, పీసీసీ సభ్యులు కె. జాన్ సుధాకర్, పి. రాజకుమార్,కుండ విజయ్ కుమార్, జి. షాలేమ్ రాజు, సండేస్కూల్ సభ్యులు పాల్గొన్నారు.



క్రీస్తు చరిత్రపై చిన్నారుల ప్రదర్శన



ఎన్ఏడీ కొత్తరోడ్‌లోని చర్చిలో కేక్‌కట్ చేస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కృష్ణ



యునైటెడ్ చర్చిలో ప్రార్థన చేస్తున్న భక్తులు



క్రీస్తు జనన ఘట్టాన్ని వివరిస్తూ..

సౌత్ జోన్ యూత్ ఫెస్ట్‌కు తరలిన ఏయూ బృందం

విశాఖ విద్య: 38వ ఏఐయూ ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్‌కు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి విద్యార్థుల బృందం బుధవారం తరలివెళ్లింది. ఏయూ ఆర్ట్స్, ఫార్మసీ, ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలకు చెందిన 46 మంది విద్యార్థులతో కూడిన బృందం ఈ ఫెస్టివల్‌లో పాల్గొంటుంది. తమిళనాడులోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఇది జరగనుంది. మ్యూజిక్, డ్యాన్స్ లిటరరీ, థియేటర్, ఫైన్ ఆర్ట్స్ విభాగాల్లో 27 అంశాల్లో జరిగే పోటీల్లో ఏయూ విద్యార్థులు తమ ప్రతిభ చూపనున్నారు. బుధవారం ఉదయం ఏయూ పరిపాలన భవనం వద్ద ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు జెండా ఊపి విద్యార్థుల బృందాన్ని పంపించారు. కార్యక్రమంలో డీన్ ఆచార్య రాంబాబు, ఆచార్య ఎన్.విజయమోహన్, డి.సింహాచలం, విద్యార్థుల బృంద మేనేజర్ జి.కె.డి.ప్రసాద్ పాల్గొన్నారు.



జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు